ప్రజాశక్తి
మంగళవారం 9 జనవరి 2024
5
శ్రీకాకుళం



అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని పొడుగు నారాయణమ్మ కాలనీ, చిన్నబొందిలీపురం, హరిజన వీధి, హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, వైసిపి నాయకులు సాధు వైకుంఠరావు, టంకాల బాలకృష్ణ, నక్క రామరాజు, చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులమైనా ఆర్‌ఆర్ ప్యాకేజీ ఆపేశారు

- ఆఫ్‌షోర్ నిర్వాసితుల ఫిర్యాదు
- 'స్పందన'కు 273 వినతులు
- ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలి
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్


వినతిపత్రం అందిస్తున్న ఆఫ్‌షోర్ నిర్వాసితులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తాము అర్హులమైనా రకరకాల సాంకేతిక కారణాలతో తమకు రావాల్సిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ డబ్బులను ఆపేశారని ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలు స్పందనలో ఫిర్యాదు చేశాయి. జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 273 వినతులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వినతులు స్వీకరించారు. చీపురుపల్లి నిర్వాసిత గ్రామంలో సుమారు 350 కుటుంబాలు ఉండగా అందులో వంద మందికి ప్యాకేజీ అందలేదని తెలిపారు. వారిలో 50 మంది పేర్లను పరిశీలించి అర్హులుగా తేల్చి జాబితా తయారు చేసినా, నేటికీ వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకపోవడం వల్ల పునరావాస కాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు డబ్బుల్లేక నిర్వాసిత గ్రామంలోనే ఉంటున్నామని వివరించారు. పునరావాస కాలనీలో కనీసం రోడ్లు, విద్యుద్దీపాలు, కాలవలు కూడా నిర్మించలేదని చెప్పారు. గ్రామస్తులు సొంత నిధులతో నిర్మించుకున్న ఆలయాలకు పరిహారం ఇవ్వడం లేదన్నారు. ఎపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.మోహనరావు ఆధ్వర్యాన ఎన్.చిరంజీవులు, ఐ.కృష్ణారావు, పి.త్రినాథ్, ఎస్.మల్లేశ్వరి, ఎస్.సరోజని వినతిపత్రం అందించారు.

ఎచ్చెర్ల మండలం తోటపాలెంకు చెందిన బలగ మోహనరావు తమ గ్రామంలో 130 ఎస్‌సి కుటుంబాలు ఉన్నాయని, గ్రామంలో శ్మశానవాటిక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. శ్మశానవాటికను మంజూరు చేయాలని కోరారు. నందిగాం మండలంలో పలువురు రైస్ మిల్లర్లు తేమశాతం, దిగుబడి తక్కువ వస్తుందనే పేరుతో 80 కేజీల బస్తాకు రెండు నుంచి మూడు కేజీలు అదనంగా తీసుకుంటున్నారంటూ కణితూరుకు చెందిన మెట్ట శ్యామలరావు ఆధ్వర్యాన పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ఎచ్చెర్ల మండలం దుప్పలవలసకు చెందిన ఉప్పులూరి జగన్నాథ ప్రభాకర్ తనకు సంబంధించి దుప్పలవలస గ్రామం రెసిడెన్షియల్ ఎదురుగా ఉన్న 10 సెంట్లలో తన సొంత స్థలాన్ని వేరొకరి ఆక్రమించారని తనకు తన స్థలం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. నందిగాం మండలం అరసవెల్లి వెలమవీధికి చెందిన రోకళ్ల మహాలక్ష్మి తనకు వంశపారంపర్యంగా సంక్రమించిన ఐదెకరాల తోటను చుట్టుపక్కల ఉన్న వాళ్లు ఆక్రమించుకుంటున్నారంటూ ఫిర్యాదు చేశారు. పొందూరు మండలం నందివాడకు చెందిన లింగాల కోటేశ్వరరావు తనకు సంబంధించిన భూమిని నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించుకున్నారని తన భూమిని తనకు ఇప్పించాలని కోరారు. నందిగాం మండలం చెరుకుపల్లిలో పాత కాలువ పూర్తిగా పాడైపోయిందని, స్థానిక ఎంపిపి స్కూల్ నుంచి చెరువు వరకు కాలువ సర్వే చేసి కొత్త పనులకు అనుమతులు ఇవ్వాలంటూ గ్రామానికి చెందిన కోనారి రామారావు ఆధ్వర్యాన గ్రామానికి చెందిన పలువురు స్పందనలో వినతిపత్రం అందించారు.

స్పందనకు 273 వినతులు

రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి స్పందనకు మొత్తం 273 అర్జీలు వచ్చాయి. జెసి నవీన్ అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. అర్జీల స్వీకరణ అనంతరం వివిధ శాఖలలో అర్జీలపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను అలసత్వం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ అర్జీలు స్వీకరించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఒక్క ఛాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

ఎమ్మెల్యే బెందాళం అశోక్

ప్రజాశక్తి - కవిటి

ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి కొన్ని తరాల జీవితాలను, రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆరోపించారు. మండలంలో రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆశపెట్టి ఆయువు తీసిన చందంగా సిపిఎస్ రద్దు చేస్తాను, జాబ్ కేలండర్ విడుదల చేస్తాను, మద్యపానం నిషేధం చేస్తాను, మెడలు వంచైనా సరే ప్రత్యేక హోదా సాధిస్తాను, అంగన్వాడీలకు జీతాలు పెంచేస్తానంటూ ప్రగల్భాలు పలికి చేతులెత్తేసిన ఘనత జగన్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. ఇక ప్రతి రైతుకి రూ.15 వేలు రైతుభరోసా అందిస్తానని చెప్పి కేంద్రం ఇచ్చే భరోసాతో కలిపి అంటూ తన వాటాగా రూ.7,500కే సరిపెట్టేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను రూ.మూడు వేలు ఇస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక పెంచుకుంటూ పోతానని మాట మార్చిన ఘనత కూడా జగన్‌దేనన్నారు. ఇక రాష్ట్రంలో పెట్టుబడుల సంగతి సరేసరని ఇక్కడ వాటాలు, కమీషన్లు ఇచ్చుకోలేక పరిశ్రమలు పారిపోతున్నాయని ధ్వజమెత్తారు. ఇక సంక్షేమం అంటూ రూ.వంద ఇచ్చి ట్రూఅప్ ఛార్జీల పేరుతో దోచుకుంటున్నారని, చివరికి చెత్తపైనా పన్ను వేసి పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. ఒక్క ఛాన్స్ ఎందుకు ఇచ్చామా అన్న మీమాంసలో జనం పడిపోయారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చని ఎద్దేవా చేశారు. ప్రజలే కాకుండా సొంత పార్టీ నేతలూ జగన్‌ను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మరో మూడు నెలల్లో ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.చంద్రమోహన్, పి.మణిబాబు, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.రమణ



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

ప్రజాశక్తి - జి.సిగడాం

మిచౌంగ్ తుపాను కారణంగా రంగు మారిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బాతువలో రైతులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో దళారుల హవా సాగుతుందన్నారు. తేమ శాతం తగ్గిందని 3, 4 కేజీలు అదనంగా తీసుకుంటున్నారని తెలిపారు. ధాన్యం డబ్బులతో పాటు కూలీలు, సంచుల ఖర్చులూ వేయాలని డిమాండ్ చేశారు. తోటపల్లి కాలువ పూడికలు తీయకపోవడంతో రైతులకు సాగునీరందడం లేదని తెలిపారు. పూడికలు తీయించాలని డిమాండ్ చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో టి.మోహనరంగా, ఎం.అసిరినాయుడు, పి.రమణ, టి.అప్పలనాయుడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సిఐ, ఎస్‌ఐల బదిలీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో పలువురు సిఐలు, ఎస్‌ఐలను బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
ఆర్.ఇ.సిహెచ్.ప్రసాద్	ఇచ్ఛాపురం సిఐ	విశాఖ
టి.ఇమ్మాన్యుల్‌రాజు	శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్	ఇచ్ఛాపురం సిఐ
సిహెచ్.సూరినాయుడు	శ్రీకాకుళం క్రైమ్ బ్యూరో	శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్
పి.శ్రీనివాసరావు	శ్రీకాకుళం టౌన్	విశాఖ
జి.ఉమామహేశ్వరరావు	విశాఖ సిటీ	శ్రీకాకుళం టూ టౌన్
పి.ఈశ్వరరావు	పరవాడ	కాశీబుగ్గ రూరల్
జి.శంకరరావు	కాశీబుగ్గ రూరల్	అనకాపల్లి టౌన్
టి.శ్రీను	అనకాపల్లి ట్రాఫిక్	శ్రీకాకుళం సోషల్ మీడియా సైబర్ సెల్
ఎన్.హెచ్.వి.ఆనంద్	విజయనగరం టూ టౌన్	కాశీబుగ్గ టౌన్
జి.నిర్మల	విశాఖ సిటీ	జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్
డి.నవీన్‌కుమార్	కాశీబుగ్గ టౌన్	పాడేరు
జి.సోమశేఖర్	విశాఖ సిటీ	జిల్లా క్రైమ్ బ్యూరో

అవసరం లేని వస్తువులు తొలగించాలి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఖజానా కార్యాలయాల్లోని స్ట్రాంగ్‌రూమ్‌ల్లో ప్రభుత్వ శాఖలు భద్రపరిచిన వస్తువులను పరిశీలించి, అవసరం లేని వాటిని తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో జిల్లాస్థాయి కమిటీ సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఖజానా కార్యాలయాల్లో స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచిన వస్తువుల సమీక్ష, తనిఖీ, డిస్పోజల్, రిటెక్షన్‌పై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల మెటీరియల్ నిల్వ చేయడానికి స్ట్రాంగ్‌రూమ్‌లకు స్థలాభావం ఏర్పడతుందన్నారు. ప్రస్తుతం స్ట్రాంగ్‌రూములోని అవసరం లేని వస్తువులను సంబంధిత శాఖలు తొలగించేలా పర్యవేక్షణ చేయడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ట్రెజరీ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లా ట్రెజరీలో, సబ్ ట్రెజరీలో భద్రపరిచిన వస్తువులను శాఖల వారీగా వివరాలు ఇప్పటికే అందించామని తెలిపారు. వీటిలో తిరిగి తీసుకునేవి, డిస్పోజల్ చేసేవి, భద్రపర్చాల్సిన వాటి వివరాలను ఈనెల పదో తేదీ లోగా అందిస్తే జిల్లాస్థాయి కమిటీ పరిశీలించి ఉత్తర్వులు జారీ చేసేందుకు వీలుందన్నారు. సమావేశంలో జిల్లాస్థాయి కమిటీ కన్వీనర్, జిల్లా ఖజానా శాఖ ఉప సంచాలకులు సిహెచ్.రవికుమార్, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, డిపిఒ రవికుమార్, డిఇఒ వెంకటేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్ (స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్స్) మన్మథరావు, దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా బజారును సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సిక్కోలు డ్వాక్రా బజారును జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. నగరంలోని మున్సిపల్ మైదానంలో ఈనెల తొమ్మిదో తేదీ వరకు ఏర్పాటు చేసిన సిక్కోలు డ్వాక్రా బజారును సోమవారం సందర్శించారు. వారం రోజులు ప్రదర్శనలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆయన అడుగ్గా, ఎటువంటి ఇబ్బందులు లేవని సంఘాల సభ్యులు తెలిపారు. స్టాల్స్ అన్నింటినీ పరిశీలించి ఎక్కడ నుంచి వచ్చారు, వ్యాపారం ఎలా ఉందని అడిగారు. మరిన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఇతర ప్రాంతాల్లోనూ జిల్లా స్టాల్స్ ఏర్పాటు చేసి మన ఉత్పత్తులు అడిగే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అరాచకమే తప్ప అభివృద్ధి లేదు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో అరాచకం తప్ప అభివృద్ధి లేకుండా పోయిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన అరాచకం, విధ్వంసం నిరాటంకంగా కొనసాగుతోందని తెలిపారు. మరో మూడు నెలల్లో ఓటు ద్వారా ప్రజలు వాటికి చరమగీతం పాడనున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలను పూర్తిగా నిర్వీర్యం చేశారని, సాగునీటి కాలువలకు కనీస మరమ్మతులు చేపట్టకుండా సాగునీరందని స్థితిని కల్పించారని ధ్వజమెత్తారు. రివర్స్ టెండరింగ్‌తో రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టునూ పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. వైసిపి నాయకులు దళారులుగా అవతారమెత్తి రైతులను దోచుకున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేయకుండా, కనీసం ఒకటో తేదీకైనా జీతాలను సక్రమంగా చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. మాట తప్పను మడమ తిప్పను అన్న జగన్ విశ్వసనీయతను కోల్పోయారని, ఎమ్మెల్యేలందరినీ మార్చినా వచ్చే ఎన్నికల్లో వైసిపి ఓటమిని అడ్డుకోలేరని పేర్కొన్నారు. ప్రజలు జగన్‌ను సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిందని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని నువ్వలరేవులో వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా, ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.మూడు వేలు ఇస్తున్నట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థతో జిల్లా, మండల కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా ఉన్న ఊరిలోనే పనులవుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అందరినీ దగా చేశారని చెప్పారు. ఎన్నికలు వస్తుండడంతో మాయ మాటలతో మళ్లీ వస్తున్న చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అనంతరం నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ కర్ణాకర్, సర్పంచ్ ఎర్రా తదితరులు పాల్గొన్నారు.


పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి అప్పలరాజు

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

- నేడు జైల్‌భరో
- 28వ రోజుకు అంగన్వాడీల సమ్మె


శ్రీకాకుళం : దీక్షా శిబిరంలో నిద్రిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు సమ్మెను విరమించేది లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ఎస్మా ప్రయోగించినా తగ్గేది లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరింది. నగరంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద అంగన్వాడీలు చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్ష మూడో రోజు సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. అంగన్వాడీలు 28 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తూ మరోవైపు అణచివేత పద్ధతులను అవలంభిస్తోందని విమర్శించారు. సమ్మెలో భాగంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా అన్ని కార్మిక, అనుబంధ సంఘాలు జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, ఎ.కనక నాగరత్నం, బసవ యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో ఎస్మా ఎత్తివేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ, సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, గొండు నీలన్న తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగాన్ని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బెలూన్లను ఎగురవేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.హేమలత, ధనలక్ష్మి, అమ్మాయమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిర్ల ప్రసాదరావు, నిమ్మక అప్పన్న తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో ఎస్మా ప్రయోగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబరు 2 ప్రతులను దహనం చేశారు. సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి ఎల్లయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, రమణమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో జిఒ నంబరు 2 ప్రతులను దహనం చేసి నినాదాలు చేశారు. ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డేపల్లి మోహనరావు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, మొదలవలస లత, మాధవి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగాన్ని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. రణస్థలం మండల కేంద్రంలో సిపిఎం నాయకులు వెలమల రమణ అధ్యక్షతన సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్మాను రద్దు చేయకపోతే వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుతామని హెచ్చరించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తీర్మానించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.సింహాద్రి నాయుడు, టిడిపి మాజీ మండల అధ్యక్షులు డి.జి.ఎం ఆనందరావు, పిన్నింటి భానోజీ నాయుడు, జనసేన మండల అధ్యక్షులు బస్వా గోవిందరెడ్డి, దాసరి బలరాం, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం మండల అధ్యక్షులు వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురం, పలాస, పొందూరులో సమ్మె శిబిరాల్లో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : జిఒ ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు



కోటబొమ్మాళి : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తూ...



కొత్తూరు : నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

ఇళ్లకు పయనమైన వసతిగృహ విద్యార్థులు

ప్రజాశక్తి - టెక్కలి

ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు నేటి నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో మూతపడనున్నాయి. విద్యాశాఖ అకడమిక్ కేలండరు ప్రకారం తిరిగి ఈనెల 19వ తేదీన తెరుచుకోనున్నాయి. పండగకు ముందు ఎక్కువ రోజులు సెలవులు ఉండగా, సంక్రాంతి పండగ తర్వాత రెండు రోజుల అనంతరం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో సోమవారం సాయంత్రం నుంచే వసతిగృహ విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు.

సచిన్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారుల ప్రతిభ



ట్రోఫీని అందుకుంటున్న క్రీడాకారులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కర్ణాటకలో జరిగిన ఆల్ ఇండియా వాలీబాల్ టోర్నమెంట్‌లో పూండి సచిన్ స్పోర్ట్స్ వాలీబాల్ క్లబ్ విజేతగా నిలిచిందని సంస్థ అధినేత నందికి దనరాజు తెలిపారు. ఈ మేరకు పూండిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సచిన్ స్పోర్ట్స్ వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యాన ఏపి జట్టుగా ఆడి విజయం సాధించిందన్నారు. ఫైనల్‌లో బెంగళూరు రైల్వేస్‌తో తలపడి 3-1 తేడాతో విజయం సాధించిందన్నారు. ఆల్ ఇండియా టోర్నమెంట్ విజయం పట్ల వచ్చేలా ప్రోత్సహించిన సచిన్ స్పోర్ట్స్ వాలీబాల్ క్లబ్ అధినేత ధనరాజుని ఇంటర్నేషనల్ వాలీబాల్ కోచ్ హెచ్.జె.రామస్వామి అభినందించారు. జిల్లాకు చెందిన విజయ్ కుమార్, మెట్ట తరుణ్ తేజ ఆట ఆదారని తెలిపారు.



ఆందోళన చేస్తున్న రైల్వే కార్మికులు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- పలాస

రైల్వేశాఖలో కొత్తగా నియమిస్తున్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని శ్రామిక్ యూనియన్ జాయింట్ జనరల్ సెక్రటరీ మట్ట రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ఆ సంఘం ఆధ్వర్యాన కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త పెన్షన్ వల్ల ఉద్యోగులు అన్ని విధాలా నష్టపోతారని స్పష్టం చేశారు. ఆలిండియా రైల్వే ఫెడరేషన్ నేతృత్వంలో గతేడాది నుంచి దశల వారీగా ఉద్యమాలు చేస్తోందని, ఇంతవరకూ రైల్వే మంత్రిత్వశాఖ, అధికారులు స్పందించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాదీ దశలవారీగా ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైల్వేశాఖ దిగివచ్చి పాత పెన్షన్ పునరుద్ధరించేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు పివివిఎస్ రావు, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, బి.గాంధీ, కామేశ్వరరావు, ఎం.డి.వి.రమణ, ఎల్.వెంకటరావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి


ప్రజాశక్తి- ఆమదాలవలస

భూ హక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కణితి విజయలక్ష్మి భాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ కోర్టు విధులను బహిష్కరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూహక్కుచట్టం జిఒ నెంబర్ 512 న్యాయవాదులకు గొడ్డలి పెట్టు అన్నారు. ప్రజలు, రైతులకు హానికరమైన టైటిల్ యాక్ట్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టంతో ప్రజల భూములు స్థిరాస్తి హక్కులను న్యాయవ్యవస్థ పరిధి నుంచి తొలగించి రాజకీయ దళారులకు అప్పగించేదే ఈ యాక్ట్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు, పైడి వరాహ నరసింహం, తమ్మినేని అన్నంనాయుడు, వాడవలస రాజేశ్వరరావు, బూర్లె సీతారాం, న్యాయవాదులు పాల్గొన్నారు.

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ

కో-ఆర్డినేటర్‌గా అన్నాజీరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస



పుష్పగుచ్ఛం అందజేస్తున్న అన్నాజీరావు

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా సనపల అన్నాజీరావును అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ సందర్భంగా సోమవారం అన్నాజీరావు మాట్లాడుతూ రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ప్రణాళికాబద్ధంగా పార్లమెంట్ నియోజకవర్గానికి కో-ఆర్డినేటర్‌ను నియమించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం ఇచ్చిన పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, యువ నాయకులు రాహుల్ గాంధీ, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఉత్తరాంధ్ర జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ రాకేష్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.



రణస్థలం : పెరటికోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

పెరటికోళ్లు పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వయంశక్తి సంఘ సభ్యులకు సోమవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేతుల మీదుగా పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు అదనపు ఆదాయం పొంది ఆర్థికాభివృద్ధి సాధించవచ్చున్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, లావేరు మండల జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, గొర్లె అప్పలనర్సునాయుడు, కరిమి రామకోటి, ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు మహంతి చిన్నరామునాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గొర్లె అప్పలనాయుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మహిళా స్వయంశక్తి సంఘ సభ్యులకు మండల పరిషత్ అధ్యక్షులు మొదలవలస చిరంజీవి చేతుల మీదుగా పెరటికోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు శంకర్, అగ్రి కల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బొడ్డేపల్లి సుధాకర్, వైసిపి నాయకులు నేతింటి సత్యనారాయణ, ఎపిఎం సత్యనారాయణ, సిఎఫ్‌లు పాల్గొన్నారు.

20వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

శ్రీకాకుళం అర్బన్ : సమగ్ర శిక్ష పరిధిలో 18 విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు గడచిన 20 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని, సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల జెఎసి అధ్యక్షులు పైడి మురళీ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. ఈ శిబిరంలో ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేసి ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఉద్యోగుల జెఎసి ప్రధాన కార్యదర్శి పోలాకి తవిటి నాయుడు మాట్లాడుతూ ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ శిబిరంలో కోశాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గిరిధర్, పోతయ్య, రాము మాట్లాడారు. సంఘ నాయకులు యుగంధర్, నరసింహారావు, ప్రసాదరావు, శైలజ, అరుధంతి, ఉషారాణి, అరుణ కుమారి, జ్యోతి, నాగమణి, శిరీష పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్ డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆర్‌అండ్‌బి అతిథిగృహం నుంచి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ధర్నా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 105 మున్సిపాలిటీల్లో కార్మికులంతా సమ్మెచేసి ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం మొక్కుబడి చర్చలతో కాలయాపన చేయడం సరికాదన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నీటిసరఫరా, వీధిలైట్లు, యూజీడి కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం యూనియన్ నాయకులతో నిర్వహించే చర్చల్లో సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.యుగంధర్, ధనాలు చిట్టి, అరుగుల రాము, సిహెచ్ మురుగన్, పి.బాలకృష్ణ, బి.భాస్కరరావు, అరుగుల లక్ష్మి, జయ, మాధవి, టి.వెంకటలక్ష్మి, బి.స్వప్న, శేఖర్, అర్‌జి గణేష్, జె.రమేష్, బి.సరోజ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 14వ రోజుకు చేరుకుంది. పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద శిబిరంలో వద్ద సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు సమ్మె శిబిరాన్ని సందర్శించి మున్సిపల్ కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. మున్సిపల్ కార్మికులను మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్ కార్యాలయానికి పిలిపించి మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుందని, సమ్మె విరమించి విధులకు హాజరుకావాలని కోరారు. కార్మిక నాయకుడు తాడి సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను నెరవేరుస్తామని స్పష్టమైన హామీ ఇచ్చేవరకు సమ్మెను విరమించేది లేదని కమిషనర్‌కు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు కె.శ్రీనివాసరావు, తారకేశ్వరరావు, జె.శ్రీను పాల్గొన్నారు.



పలాస : ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఇచ్ఛాపురం : మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 14వ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లను పరిష్కారం కావాలని, ముఖ్యమంత్రి జగన్‌కి మంచి ఆలోచన రావాలని దీక్ష శిబిరంలో ప్రార్థనలు చేస్తూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్ కుమార్ పట్నాయక్, అంతకుముందు మున్సిపల్ కమిషనర్ రమేష్ పారిశుధ్య కార్మికులతో సమ్మె విరమింపచేసేందుకు చేపట్టిన చర్చలు విఫలమయ్యాయి. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు తమ డిమాండ్ల పరిష్కారమయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

పలాస : మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెలో కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మురగన్, ఎం.రవి, దివాకర్, యస్ శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, సావిత్రి, లక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌పి రాధిక

పోలీస్ స్పందనకు 29 ఫిర్యాదులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందన ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా ఎస్‌పి జిఆర్.రాధిక పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్‌పితో పాటు అదనపు ఎస్‌పిలు విఎన్ మణికంఠ, జె.తిప్పేస్వామి ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా 29 ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలపై ఎస్‌పి సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి అర్జీలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకువాలని ఆదేశించారు.



వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆల్ ఫెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు, కోశాధికారి హెచ్‌వి.సత్యనారాయణ సబ్‌ట్రెజరీ ఆఫీసర్ ఎస్.సువర్ణరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ పర్సన్స్, ఫ్యామిలీ ఫెన్షనర్లు వచ్చేనెల ఫిబ్రవరి 29లోగా జీవన ప్రమాణ ధ్రువపత్రాలను సబ్ ట్రెజరీ కార్యాలయంలో, ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఫెన్షనర్ల జీవన ప్రమాణ ధ్రువపత్రాలను స్వీకరిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

ఇచ్ఛాపురం : ప్రభుత్వం ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ఈ నెల 9నుంచి 18 వరకు ప్రకటించిందని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఈ సెలవులను ప్రయివేట్ విద్యాసంస్థలు కచ్చితంగా అమలు చేయాలని ప్రయివేటు విద్యాసంస్థల నియోజకవర్గ యూనియన్ అధ్యక్షులు చాట్ల తులసీదాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో పాఠశాలలు నిర్వహించరాదని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- నౌపడ

వైసిపి ప్రభుత్వం హయాంలోనే మారుమూల గ్రామాల్లో సైతం అభివృద్ధి చెందుతుందని జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి అన్నారు. సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్రలో జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం రూ. లక్ష ఏభై వేలు జిల్లా పరిషత్ నిధులతో బోరు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి కోత శ్రీకన్య, కో-ఆప్షన్ మెంబర్ హన్నూరావు, సంతబొమ్మాళి సర్పంచ్ ప్రతినిధి కళింగపట్నం అప్పారావు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్ : మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు రాయి తరలిస్తున్న భారీ వాహనం తగిలి ద్విచక్ర వాహన దారుడు గాయపడ్డాడు. సోమవారం స్థానిక పాత జాతీయ రహదారి మెళియాపుట్టి నాలుగు రోడ్ల కూడలి వద్ద గూడెం రోడ్డు నుంచి స్థానిక ఎన్‌టిఆర్ నగర్‌కు చెందిన సదాశివుని వెంకటేష్ తన ద్విచక్ర వాహనంపై టెక్కలి వైపు వస్తున్నాడు. అదే మార్గంలో వస్తున్న కొండ బండ రాళ్లతో వస్తున్న భారీ పోర్టు వాహనం బైక్‌కు తగిలి ఈడ్చు కుపోయింది. ఈ ప్రమాదంలో కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఎస్‌ఐ-2 రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- బూర్జ

సికిల్ సెల్ ఎనిమియ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని గుత్తావల్లి పిహెచ్‌సి వైద్యాధికారి రమ్యశ్రీ అన్నారు. సోమవారం గుత్తావల్లి పిహెచ్‌సి పరిధి అన్నంపేట పంచాయతీలో మాసానపుట్టి, జంగాలపాడు, జివిపేట, అడ్డూరిపేట గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. 12 మందికి సికిల్ సెల్ ఎనిమియ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. అనంతరం సికిల్ సెల్ ఎనిమియ వ్యాధిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రక్త హీనత, ఒళ్లు నొప్పులతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఇటువంటి లక్షణాలు కలిగి వుంటే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి వారి సలహాపై మందులను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.నవీన, సిహెచ్‌ఒలు పద్మావతి, మురళి, హెల్త్ అసిస్టెంట్లు వెంకట



బూర్జ : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రమ్యశ్రీ

అప్పలనాయుడు, విక్రమ్, రాజులమ్మ, సరోజిని, ఎఎన్‌ఎంలు రమాదేవి, పుష్ప, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పశువు ల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్య అధికారి పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని గరుడుభద్ర పంచాయతీ మర్రిపాడులో సర్పంచ్ గూడ గిరిజ, ప్రతినిధి ఈశ్వరరావు ఆధ్వర్యాన పాడి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను సోమవారం వేశారు. పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు జి.ధనరాజు, కె.హేమసుందర్, కె.వాసుదేవ్, కె.రాజు, ఎం.రాజులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంఇఒలు

టెక్కలి : విద్యారంగ అభివృద్ధిలో భాగంగా తీసుకునే నిర్ణయాలకు యుటిఎఫ్ సహకరిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక మండల రిసోర్స్ కార్యాలయంలో యుటిఎఫ్ నాయకులతో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు యుటిఎఫ్ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ టిడిఎస్ చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు. బొరిగిపేట, పెద్దసానా ప్రాథమికోన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న హిందీ భాషా ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు మంజూరు చేయిస్తామని అన్నారు. భగవాన్‌పురం ప్రాథమికోన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు పోలాకి ఈశ్వరరావుకు చెందిన నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుపై అన్ని అర్హతలూ ఉన్న కారణంగా మంజూరు చేయనున్నట్లు వారు హామీనిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు పడాల గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, గౌరవ అధ్యక్షులు మారం కుమారస్వామి, జిల్లా సహ అధ్యక్షులు కురమాన దాలయ్య, పాలవలస ధర్మారావు, బమ్మిడి ఖగేశ్వరరావు, దవళ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

ప్రజాశక్తి- కవిటి

ఎంపిపి కడియా పద్మ అనారోగ్యానికి గురై విశాఖపట్నంలో చికిత్సపొంది ఇటీవల ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సోమవారం పరామర్శించారు. పద్మతో మాట్లాడి ఆరోగ్యంపై వాకబు చేశారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలి కాళీని పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, కంచిలి ఎంపిపి పి.దేవదాస్‌రెడ్డి, ఎఎంసి



ఎంపిపితో మాట్లాడుతున్న విజయ

చైర్మన్ బాబూరావు, వైస్‌చైర్మన్ వై.నీలయ్య, సర్పంచ్‌లు బి.శ్రీరామ్‌ప్రసాద్, కడియాల హేమలత, ఎన్ని అశోక్, దీనబంధు పాల్గొన్నారు.

ముకుందరావుకు ప్రశంసలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్, గైట్ విద్యాసంస్థల అధినేత చైతన్యరాజు ఆధ్వర్యంలో జనవరి 5, 6, 7 తేదీల్లో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించారు. అందులో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్, తెలుగుశాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ పెద్దింటి ముకుందరావు పాల్గొన్నారు. నాగాలాండ్ గవర్నర్ లాల్ గణేషన్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆచంట శేషసాయి, జస్టిస్ దుర్గాప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌జెయుకెటి సంచాలకులు ఆచార్య కెవిజిడి బాలాజీ, ఒఎస్‌డి ఎల్‌డి. సుధాకర్‌బాబు, ఎఐ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఎఫ్ఒ డా. అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవికుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.



చిన్నారావు దంపతులను సన్మానిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

చిన్నారావుకు సన్మానం

శ్రీకాకుళం అర్బన్ : దేశ సరిహద్దులో రక్షణ శాఖలో జెసిడి కేడర్‌లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన గొండు చిన్నారావును ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఘనంగా సత్కరించారు. నగరంలో ప్రజాసదన్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని దుశ్శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ రామకృష్ణాపురం గ్రామం నుంచి భద్రతా ఉద్యోగిగా చేరి 27ఏళ్ల పాటు విధులు నిర్వహించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్, గార మండల టిడిపి అధ్యక్షులు గొండు వెంకట రమణమూర్తి, గున్నయ్య, తూలుగు మాజీ సర్పంచ్ కొయ్యన జగదీష్, మాజీ ఎంపిటిసి గొండు అచ్యుతరావు, ముకుంద, సవాడ శ్రీను పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభం

ఎచ్చెర్ల : డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన పరిపాలన భవన ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. జిప్లస్ ఫోర్ నమూనాలో, సిపిడబ్ల్యుడి విజయవాడ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన ఈ భవనాన్ని వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య నిమ్మ వెంకటరావు సోమవారం పరిశీలించి ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లును అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, ఇంజనీర్ అంజిత్ కుమార్, డా.కె.తారక రామారావు, సిపిడబ్ల్యుడి సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- కవిటి

కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాల, ఎస్విజె విద్యా సంస్థల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కరస్పాండెంట్లు లోళ్ల రాజేష్, బి.వి.వి.ప్రసాదరావు బోగి మంటలు ముట్టించి సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భం గా చిన్నారులు వేసిన రంగవల్లికలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ బల్లెడ రమేష్, ప్రిన్సిపాళ్లు బిందుమాధవి, బి.జగ్గారావు, పండి సత్యనారాయణ, మరిడి భాస్కరరావు, ఎఒలు బల్లెడ రాణి, జోష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నూక లక్ష్మణరావు ఆధ్వర్యాన విద్యార్థులు పాఠశాల ఆవరణలో ముగ్గులు, భోగి మంటలు వేసి, పిండి వంటలు తయారు చేసి సంక్రాంతి పండగను ముందస్తుగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రాదా య దుస్తులు ధరించి గొబ్బెమ్మల పాటలు, తప్పెడుగుళ్లు, ఆటలతో చేసిన నృత్యం పలువురుని ఆలరించింది.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పురుషోత్తంపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వై.లత, ఈదుపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.రామారావుల ఆధ్వర్యాన ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలపై అవగాహన కల్పించారు.

కొత్తూరు : మండలంలోని సిరుసువాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు సందర్భంగా భోగి మంటలు వేశారు. అలాగే ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె.గున్నమ్మ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎం.లోకేష్, వై.సత్యనారాయణ, కె.భవానీ, వాలంటీర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ సాయి శిరీష ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించారు. భోగి మంటల్లో భోగి పళ్లు వేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ కవిటి భారతి నగదు బహుమతి అందజేశారు.

అలాగే మండలంలోని పెదంచల ప్రభుత్వ పాఠశాలలో గ్రీన్ ఆర్మీ, హై స్కూల్ హెచ్‌ఎం మురళీకృష్ణ నాయుడు ఆధ్వర్యాన ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులతో భోగి మంటలు వేచి గ్రీన్ ఆర్మీ వారితో మొక్కలను నాటారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, ఉపాధ్యాయులు కె.ప్రసాదరావు, హెచ్.వెంకటరావు, బి.వి.ఎన్.మూర్తి, రామకృష్ణ, మాధవరావు, కె.రవిబాబు, వెంకటేష్ పట్నాయక్, కె.లత, ఎం.జ్యోతి, గ్రీన్ ఆర్మీ సభ్యులు బి.శిరీష పాల్గొన్నారు.

బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముగ్గుల పోటీలు నిర్వహించి భోగి మంటలు వేశారు. కోలాటం, జానపద నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు పాల్గొన్నారు.

పొందూరు : మండలంలోని మజ్జిలిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యాన ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, కోలాటం, హరిదాస్ కీర్తనలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధరించిన సంప్రదాయ వస్త్రాలు అలరించారు. అలాగే నాగలి పట్టిన రైతు వేషధారణతో ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే స్థానిక మానస వేణి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఎంఆర్ఆర్సిహెచ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక శ్రీవేద పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో వివిధ వేషధారణలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి.బాబూరావు, కరస్పాండెంట్ బి.సునీత, ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.



పొందూరు : భోగి మంటలు వేస్తున్న మానసవేణి విద్యార్థులు

టెక్కలి : మండలంలోని పోలవరం జిల్లా పరిషత్‌లో హెచ్‌ఎం పి.విలియం, స్థానిక రవీంద్రభారతిలో ప్రిన్సిపాల్ ఎం.పద్మజ, స్థానిక ఓక్లాండ్ ఆంతర్జాతీయ పాఠశాలల్లో ప్రిన్సిపాల్ మధులత ఆధ్వర్యాన ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామీణ వాతావరణం నేపథ్యంలో గంగిరెద్దు ఆటలు, గాలిపటాలు ఎగురవేతలు, కోలాటం వంటి ప్రదర్శనలు, విద్యార్థుల వేషధారణలు పలువురుని ఆలరించాయి. భోగి మంటలు వేశారు. ముగ్గుల పోటీలను నిర్వహించారు.

సోంపేట: పట్టణంలోని మహర్షి విద్యానికేతన్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాప్రదాయ వస్త్రధారణతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భోగి మంటలు వేసి దాని ప్రత్యేకతను తెలియజేశారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి ప్రోత్సాహకాలను అందజేశారు.

రణస్థలం : స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ ఆధ్వర్యాన ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులందరూ ముద్దులోలికే సంప్రదాయ దుస్తులతో, సంక్రాంతి స్వాగత రంగవల్లులతో, భోగి మంటలతో, గాలిప టాలతో, కుర్రకారు ఈలలతో సందడి చేశారు.



సోంపేట : భోగి మంటల చుట్టూ ప్రదర్శన చేస్తున్న మహర్షి విద్యార్థులు



టెక్కలి : వేషధారణలతో ఓక్లాండ్ విద్యార్థులు



పొందూరు : పలు వేషధారణలతో మజ్జిలిపేట పాఠశాల విద్యార్థులు



ఇచ్ఛాపురం : భోగి మంట వేస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.కృష్ణ, ప్రసాద్, లక్ష్మణరావు, బాలామణి, స్రవంతి, మాలతి, పర్వీన్, ఉదయకుమారి పాల్గొన్నారు.

లావేరు: మండలంలో లక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. చిన్నారుల హరిదాసు, పల్లెటూరి సాంప్రదా య దుస్తుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వసంత లక్ష్మి సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పలాస : నగదు బహుమతిని అందజేస్తున్న కరస్పాండెంట్ భారతి



మాట్లాడుతున్న రమణమూర్తి

రైతు దగా ప్రభుత్వం

ప్రజాశక్తి- నరసన్నపేట

వైసిపి రైతు దగా ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విమర్శించారు. నరసన్నపేటలోని టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎపిలో ప్రజావేదిక కూల్చివేతతో పాలన మొదలై రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం కూల్చివేసిందన్నారు. నాలుగున్నరేళ్లలో ఒక్క కాలువ కూడా ఆధునికీకరణ చేసిన దాఖలాలు లేవని అన్నారు. ఈయన వెంట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శి అడపా చంద్రశేఖర్, పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామరావు, మాజీ సర్పంచ్ దామోదర్ నరసింహులు, టిడిపి మండల యువత అధ్యక్షులు తంగి తారకేశ్వరరావు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బెహరాలు

బెహరాల్లో ఉప కులాలు లేవు

ప్రజాశక్తి- కవిటి

తమ తాత ముత్తాతల నుంచి బెహరాల్లో (కంద్ర) ఉప కులాలు లేవని, తాము మాత్రమే బెహరాలమని కవిటి గ్రామంలోని బెహరా (కంద్ర) కులస్తులు తెలిపారు. ఈ మేరకు సోమవారం కవిటి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తూ మాణిక్యపురం పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కొంతమంది తేరా కులస్తులు కొత్తగా తాము బెహరాలమని చెబుతున్నారని, అది వాస్తవం కాదని అన్నారు. భవిష్యత్‌లో వారికి బెహరాలకు సంబంధించిన ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకూడదని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కె.గిరి బెహరా, సంతు బెహరా, కఘపతి బెహరా, తిరుపతి బెహరా, త్రినాథ్ బెహరా, దొంబురు బెహరా, దేవా బెహరా ఉన్నారు.



మాట్లాడుతున్న సీతారాములు

బాలల హక్కులపై అవగాహన

నందిగాం : బాలల హక్కుల సంరక్షణ బాధ్యత మనందరదని బాలల హక్కుల కమిషన్ జిల్లా కౌన్సిలర్ ధర్మాన సీతారాములు అన్నారు. ఈ మేరకు మండలంలోని దేవలభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులతో బాల బాలికలకు కల్పిస్తున్న హక్కులను వివరించారు. విద్యార్థులపై లైంగిక దాడులు చేస్తే... తమను తాము రక్షించుకుంటూ టోల్ ఫ్రీ నంబరు ద్వారా పోలీస్ యంత్రాంగం సహాయం ఎలా పొందాలో వివరించారు. ముఖ్యంగా బాల్య వివాహాలు వల్ల నష్టాలు, చట్టరీత్యా ఎదుర్కోవాల్సిన సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల వేదిక కన్సల్టెంట్ ఎస్.వైకుంఠరావు, ప్రధానోపాధ్యాయులు డి.పూర్ణిమ, అనిల్ పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ప్రజలు

ఆరోగ్యవంతమైన జీవనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రతిఒక్కరు ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఆయుష్ రీజనల్ డైరక్టర్ వై.శేఖర్ పిలుపునిచ్చారు. అందులో భాగంగా కేంద్ర ఆయుష్‌శాఖ ఆధ్వర్యాన సోమవారం జిల్లాలో వెయ్యిమందితో సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేశారు. అరసవల్లి ఇంద్రపుష్కరణి వద్ద వైజయంతి ప్రాంగణంలో రెండు గంటల పాటు సామూహిక సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీనకాలం నుంచి భారత వైద్య రంగంలో ఆయుష్ అత్యంత కీలక పాత్ర పోషించిందన్నారు. వ్యాయామం, ఆహారపు అలవాట్లు, యోగ వల్ల ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండగలరన్నారు. కార్యక్రమంలో హార్టెపుల్నెస్ జోనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. లక్ష్మణరావు, ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి.జగదీష్, మెగా ఇనస్ట్రక్టర్ ఎం. వాసుదేవరావు, వైద్యాధికారులు సీతామహాలక్ష్మీ, మహతి, ప్రసన్నలక్ష్మి, పూజారి పురుషోత్తం, హార్ట్‌ఫుల్‌నెస్ జిల్లా ప్రతినిధి ఎం.సోమశేఖర్, యోగాగురువు రామారావు, యోగా పతంజలి ప్రతినిధి చిన్నబాబు పాల్గొన్నారు. అనంతరం అరసవల్లి ప్రాంగణంలో ఆయుష్, యునాని, హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించి వైద్య పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు అందజేశారు.

మాట నిలబెట్టుకున్న సిఎం



నరసన్నపేట : పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

అవ్వ తాతలకు ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో వైఎస్ఆర్ పింఛను పెంపు కానుకను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చిన ఘనత సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టిడిపి హామీలు, వారి కల్లబొల్లి మాటలు ప్రజలెవరు నమ్మవద్దని హితువుపలికారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు అన్నపూర్ణ రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, నరసన్నపేట సర్పంచ్ బురెల్ల శంకర్, కార్పొరేషన్ ఛైర్మన్ పంగ బావాజీ నాయుడు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని రట్టిలో పింఛను పెంపు కానుకను ఎమ్మెల్యే రెడ్డి శాంతి పంపిణీ చేశారు. మండలంలో 8,976 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అనంతరం సిఎం జగన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లానా బాలరాజు, సర్పంచ్ మంజు శ్యామల్, ఎంపిటిసి చిట్టిబాబు, విఆర్ఓ రమణ పాల్గొన్నారు. అలాగే బాణాపురంలో పింఛను కాకను వైస్ ఎంపిపి



మెళియాపుట్టి : పింఛనుదారులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎస్.ఆదినాయుడు పంపిణీ చేశారు. సర్పంచ్ పెద్దింటి చందర్రావు, కార్యదర్శి ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని హరిశ్చంద్రపురం పరిధిలో సర్పంచ్ జి.కేశవరావు ఆధ్వర్యాన పెంచిన పింఛను కానుకను నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పంపిణీ చేశారు. కార్యక్రమంల ఎంపిటిసిలు బగాది దివాకర్, పూజారి సత్యం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని ఆరో వార్డులో పింఛన్లు రూ.3 వేలు పెంచిన నేపథ్యంలో సిఎం జగన్ చిత్రపటానికి కౌన్సిలర్ పరపటి మంజులతా అధ్వర్యాన పాలాభిషేఖం చేశారు. కార్యక్రమంలో పి.కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించాలి

ప్రజాశక్తి- బూర్జ

మా భూములు మాకు ఇప్పించండి మహాప్రభో అంటూ లచ్చయ్యపేట గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ సనపల రమణారావుకు భూసమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న భూసర్వేలో లచ్చయ్య పేట, సింగన్నపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 22లో సుమారు 56 ఎకరాల పంట భూమి ప్రభుత్వ భూమిగా చూపిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని దశాబ్దాల కాలంగా ఆ భూముల్లో పంటలు పండించుకుని జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం వాటిపై వ్యవసాయ రుణాలు కూడా మంజూరు చేస్తున్నారని, ఇప్పటివరకు ఏ అధికారులు ఈ భూములు ప్రభుత్వానివని తెలియజేయలేదని వాపోయారు. ఈ సమస్యపై డిసెంబర్ 11న కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రాన్ని అందించినట్టు బాధిత రైతులు తెలిపారు. ఇందులో జిరాయితీ భూములు ఉన్నాయని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 22లో ఎ అనేది ఇంతవరకు లేదని, ఇటీవల కాలంలోనే సచివాలయ, రెవిన్యూ సిబ్బంది, మీసేవ ప్రతినిధులు కలిసి కుమ్మక్కై రికార్డులు మార్పు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ భూ సర్వేలు వల్ల మేలు జరుగుతుందని ఆశించిన రైతులకు తిరిగి నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లకు ఈ పాట్లు తప్పలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని బాధిత రైతులు పేర్కొన్నారు. ఈ విషయంపై తహశీల్దార్ స్పందిస్తూ 10వ తేదీన లచ్చయ్యపేట గ్రామంలో గ్రామసభ నిర్వహించి రికార్డులు పరిశీలిస్తామన్నారని బాధిత రైతులు తెలిపారు.



రణస్థలం : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రాజకీయాల్లో 'గొర్లె'ది చెరగని ముద్ర

ప్రజాశక్తి- రణస్థలం

మాజీ మంత్రి గొర్లె శ్రీరాములునాయుడు రాజకీయంగా జిల్లాలో చెరగని ముద్ర వేశారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. గొర్లె శ్రీరాములునాయుడు వర్ధంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాజకీయాలకు ఆయనే పెద్ద దిక్కన్నారు. ప్రతి రాజకీయ నాయకులు ఆయన అడుగు జాడల్లో నడిచి జిల్లాని అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, నాయకులు గొర్లె అప్పలనర్సునాయుడు, కురిటి రామకోటి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకుని అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించిన ఘనత గొర్లె శ్రీరాములు నాయుడికి దక్కిందని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం ఆయన 16వ వర్ధంతి కార్యక్రమం నగరంలో ఏడురోడ్ల కూడలిలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురంగి మోహనరావు మాట్లాడుతూ మాజీమంత్రిగా, జెడ్‌పి చైర్మన్‌గా ఆయన సేవలందించారని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందర్నీ సమాన దృక్పదంతో సేవలందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ డోల జగన్మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ పైడిశెట్టి జయంతి, రణస్థలం మాజీ జెడ్‌పిటిసి జి.లక్ష్మణరావు, తూర్పుకాపు సామాజిక వర్గం ప్రతినిధులు లంక గాంధీ, శాసపు జోగి నాయుడు, డోల బాలకృష్ణ, కెల్ల చిన్ని, వాళ్ళ శ్రీరాములు నాయుడు, ఆంకడాల తవిటన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో భవిత పాఠశాలలో సాయి డెంటల్ కాలేజీకి చెందిన దంత వైద్యులు 300 మంది విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించారు. సోమవారం పాఠశాల ఆవరణలో 1 నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దంత సంరక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. దంత సంరక్షణ పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో దంత వైద్యులు, విద్యార్థులు, పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాయకులు

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బెలగాంలో ఎన్ఆర్‌జిఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్త సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ సచివాలయం వ్యవస్థ తీసుకొచ్చారని, ప్రజలు వీటిని ఉపయోగించుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. అంతకుముందు దుగానపుట్టుగ, బెలగాం, బి.జి.పుట్టుగ, సిలగాం పంచాయతీల్లో నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బాబూరావు, వైస్‌చైర్మన్ నీలయ్య, సర్పంచ్‌లు దూగాన భద్రాచలం, ఎం.ఊర్మిళ, బద్రి ప్రకాష్, కె.వల్లభరావు, ఎంపిటిసి బసవ దివ్య, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్‌కుమార్, ఎం.ఈశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి కడియా బాబూరావు పాల్గొన్నారు.

మంత్రి చేసిన అభివృద్ధి ఏమిటి?



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

పశుసంవర్ధకశాఖ మంత్రిగా ఉండి పలాస నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో అభివృద్ధి ఏమి చేశారో చెప్పగలరా? అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు ప్రశ్నించారు. పలాస టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి హయాంలో శంకుస్థాపన చేసిన పనులకే మరలా శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. వాటినీ పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. రైల్వే వంతెన పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని చెప్పిన మంత్రి గతంలో చేసిన పనులు కన్నా మరో ఐదు స్లాబ్‌లు వేసి చేతులెత్తేశారని అన్నారు. కిడ్నీ ఆస్పత్రిని సిఎం జగన్ ఆర్భాటంగా ప్రారంభం చేశారే తప్ప పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది నియమించలేకపోయారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్య పరికరాలు అందుబాటులో లేవన్నారు. రైతుబజార్ ఏర్పాటు ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవి శంకర్ గుప్తా, బి.నాగరాజు, సప్ప నవీన్, అంబటి కృష్ణమూర్తి, అట్టాడ వాసు, దువ్వాడ సంతోష్ కుమార్, డొక్కారి శంకర్ పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే మత్స్యకారులకు గుర్తింపు

వజ్రపుకొత్తూరు : టిడిపి హయాంలోనే మత్స్యకారులకు గుర్తింపు పొందారని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సూరాడ మోహనరావు అన్నారు. ఈ మేరకు టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు చంద్రబాబు నాయుడును విమర్శించడం తప్పుబట్టారు. చంద్రబాబును విమర్శించే స్థాయి మంత్రికి లేదన్నారు. తీరప్రాంత గ్రామాల్లో అభివృద్ధి టిడిపి హయాంలో జరిగిందన్నారు. రాయితీపై డీజిల్ మరబోట్లు, వలలు ఇచ్చిన ఘనత టిడిపిదేనని అన్నారు. మత్స్యకారులకు రూ.15 కోట్లతో విశ్రాంత భవనాలు, చేపలు ఆరబెట్టేందుకు ప్లాట్ ఫార్మర్లు నిర్మించిన సంగతి గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల పాపారావు, అరసవిల్లి ఉమా మహేశ్వరరావు, ఆనంద్, వెంకటేష్, మురిపింటి నారాయణ, శాంతారావు పాల్గొన్నారు.

కుమార్ నాయక్‌కు కళానిధి పురస్కారం

ప్రజాశక్తి- పలాస

రాజమండ్రిలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగాయి. రాజరాజ నరేంద్ర వేదికపై మూడు రోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్విఘ్నంగా కొనసాగించడానికి కృషి చేసిన కుమార్ నాయక్ కళానిధి పురస్కారం లభించింది. ఆ పురస్కారాన్ని నాగాలాండ్ గవర్నర్ లాల్ గణేషన్ చేతుల మీదుగా కాశీబుగ్గకు చెందిన కుమార్ నాయక్‌కు కళానిధి పురస్కారం అందుకున్నారు. గతంలో ఇతనికి నంది అవార్డు కూడా అందుకున్నారు. కార్యక్రమంలో జస్టిస్ భవానీప్రసాద్, సినీ నటులు ప్రభాస్ తల్లి శ్యామలమ్మ, మంత్రులు మెరుగ నాగార్జున, సినీ నటులు ఆలీ, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి దాసు

రక్తం వృద్ధిపై అవగాహన

సోంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు అధ్యక్షతన రక్తం వృద్ధిపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ శరీరంలో రక్తం వృద్ధి జరిగే ధానం, వివిధ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, డాక్టర్ సౌజన్య, అధికారులు వెంకటేశ్వర్లు, శివరాం, రమేష్, రవణమ్మ, ప్రమీల, కృష్ణారావు, భాస్కరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు అభినందనలు

కవిటి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి మూడో స్థానం దక్కించుకున్నారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు బి.పవిత్ర, టి.అతుల్ భరద్వాజ, బి.కాత్యాయని పాఠశాల సిబ్బందితో పాటు స్థానిక నాయకులు అభినందించారు.



సన్మానిస్తున్న సభ్యులు

మాధవరావు దంపతులకు సన్మానం

సోంపేట : స్థానిక జైభీమ్ సేన జిల్లా గౌరవ అధ్యక్షుడు మాధవరావు దంపతులకు సోమవారం సంస్థ ప్రతినిధులు సత్కరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవితకాల సాఫల్య పురస్కారం పొందిన నేపథ్యంలో మాధవరావుతో పాటు ఆయన సతీమణిని సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు నగిరి మోహనరావు, సభ్యులు బి.ఈశ్వరరావు, డి.వెంకటరావు, ఎం.సూర్యనారాయణ, ధర్మారావు, టి.అచ్యుత్, కె.ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త భగవాన్

కొబ్బరి పంటతో అధిక లాభాలు

ప్రజాశక్తి- బూర్జ

కొబ్బరి పంట సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని ఉద్యాన పరిశోధన స్థానం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త బివికె భగవాన్ అన్నారు. సోమవారం మండలంలో పెద్దపేట గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ విశ్వవిద్యాలయంలో రైతులకు కొబ్బరిపంటపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరిపంట సాగుతో కలిగే లాభనష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ష్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, రైతులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ఆమదాలవలస : రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధితో మహిళా సంఘాల సభ్యులు సమృద్ధి సాధించాలని మెప్మా జిల్లా సంస్థాగత బలోపేత నిపుణులు బి.రామారావు అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో పట్టణ, స్లం సమాఖ్యల ఆర్‌పిలకు మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయం సంఘాలు సంస్థాగతంగా బలోపేతం అయినప్పుడే సుస్థిర అభివృద్ధి సాధించగలరని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంఘాల అభివృద్ధికి పెద్దఎత్తున తోడ్పాటును అందిస్తుందన్నారు. ప్రతి సభ్యురాలు సంఘంలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీల అక్షరాస్యతను కలిగి ఉండడం ద్వారా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సంఘ స్థాయిలో సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు లింకేజీ, జీవనోపాధుల, సామాజిక భద్రతా బలోపేత నిపుణులు ఎస్.వెంకటరావు, బి.భాస్కరరావు, వి.విజయకుమారి, సిబ్బంది రాజేష్ కుమార్, నాగమణి, అమ్మినాయుడు, ఆర్‌పిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

సంకల్పంతోనే మహిళాభివృద్ధి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా, సంకల్పంతోనే మహిళా అభివృద్ధిని సాధిస్తూ, భారత్ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తుందని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. సోమవారం మండలంలో బొబ్బిలిపేట పంచాయతీలో సర్పంచ్ గోండు వెంకటరమణ ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళలకు నేషనల్ రూరల్ లైవ్‌లో వుడ్‌మిషన్ ద్వారా వడ్డీ రాయితీతో జీవనోపాధి మెరుగు, కుటుంబ అభివృద్ధిని సాధించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. రైతులకు పిఎం కిసాన్ యోజన, ఇంటింటికి తాగునీరు అందించే ఉద్దేశంతో జలజీవన్ మిషన్ కార్యక్రమాలు, మహిళా సంక్షేమానికి కేంద్రం పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, బిజెపి నాయకులు పేడాడ సూరపునాయుడు, చింతాడ అప్పారావు, పాతిన గడ్డయ్య, గురుగుబెల్లి వెంకటరావు, ఆయుష్మాన్ భారత్ వైద్య బృందం, స్వయం శక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



గ్యాస్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎపిఎం